ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 20 జూలై 2024

ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి



బొగత.. జలసవ్వడుల పులకరింత..

తెలంగాణ నయాగరాగా పేరొందిన ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు, మూడు రోజులుగా తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వస్తున్న వరదలతో బొగత ఉప్పొంగుతోంది. జలపాతం ముందరి భాగంలోని ట్రీహౌస్ వరకు వరద నీరు చేరగా.. అల్లంత ఎత్తునుంచి దుంకుతున్న జలధారలను చూసి సందర్శకులు పులకరిస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ, జలపాతం అందాలను కెమెరాలలో బంధిస్తూ మురిసిపోతున్నారు.

- వాజేడు



సర్వమంగళ అలంకరణలో అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 19: భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొన సాగుతున్న శాకంబరీ ఉత్సవాలు శుక్రవారానికి 14వ రోజుకు చేరాయి. ఉదయం నిత్య పూజ నిర్వహించిన అనంతరం తిథి మండల దేవత యజనంలో భాగంగా ఉత్సవమూర్తికి ఇచ్ఛా శక్తిగా మాత్ర అలంకరణ చేసి పూజలు చేశారు. జ్ఞానశక్తి అయిన భద్రకాళి అమ్మవారికి సర్వమంగళ అలంకరణ చేసి పూజ ఆరాధన చేశారు. దశమహా విద్యలలో త్రయోదశికి ఆది దేవత మన్మథుడని, అమ్మవారి విభూది సర్వమంగళగా భక్తులకు సమస్త మండలాలను, శుభములను భక్తులకు అందజేస్తుందని అర్చకులు తెలిపారు. ఈనెల 21అమ్మవారి శాకంబరీ అలంకరణను పురస్కరించుకొని కూరగాయలు, పండ్లు సమర్పించుకున్న భక్తులు శనివారం సాయంత్రంలోగా ఆలయ కార్యాలయంలో అందజేయాలని ఈవో శేష భారతి కోరారు.

మోస్తరు వాన

హనుమకొండ జిల్లాలో 23.5మి.మీ, వరంగల్‌లో 20.7 మిమీ వర్షపాతం నమోదు

హనుమకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ , వరంగల్ జిల్లాలో గురువారం రాత్రి నుంచి మోస్తరు వానలు పడ్డాయి. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలో సరాసరి 23.5 మిల్లీమీటర్లు, వరంగల్ జిల్లాలో 20.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో అత్యధికంగా 39.3 మిమీ వర్షం పడగా భీమదేవరపల్లి మండలంలో 22.1, వేలేరులో 20.1, ఎల్కతుర్తిలో 21.5, హసన్‌పర్తిలో 24.1, ధర్మసాగర్‌లో 18.4, కాజీపేటలో 23.6, హనుమకొండలో 18.4, ఐనవోలులో 13, పరకాలలో 18.9, దామెరలో 24.7, ఆత్మకూరులో 27.6, శాయంపేటలో 25.3 మిమీ వర్షం పాతం నమోదైంది. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో అత్యధికంగా 42.8మిమీ వర్షం కురిసింది. గీసుకొండలో 35.4, దుగ్గొండిలో 22.4, నల్లబెల్లిలో 16.2, నర్సంపేటలో 17.2, ఖానాపూర్‌లో 18, చెన్నారావుపేటలో 3.6, సంగెంలో 14.8, వర్ధన్నపేటలో 19.6, పర్వతగిరిలో 18.6, నెక్కొండలో 10.2, ఖిలా వరంగల్‌లో 22,4, వరంగల్‌లో 28మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో సగటున 8.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక జనగామ జిల్లాలో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి.

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు

జయశంకర్‌భూపాలపల్లి, ఏజెన్సీ జిల్లా అయిన ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ములుగు జిల్లాలో 59మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. సమ్మక్క బ్యారేజీకి 4లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఏటూరునాగారం, మంగపేట వద్ద నీటిమట్టం పెరుగుతోంది. పలుచోట్ల కరకట్ట బలహీనపడగా ఇసుక బస్తాలు వేసి మరమ్మతు చేస్తున్నారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి అన్ని గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో వాజేడు మండలంలో గోదావరికి వరద నీరు భారీగా వస్తోంది. మరోవైపు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం కుండపోత వర్షం పడగా జిల్లా వ్యాప్తంగా 69.6మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు చేరింది. కాటారం మండలంలోని పలు గ్రామాలకు గంటల వ్యవధికి రాకపోకలు నిలిచిపోయాయి. సింగరేణి ఓపెన్ కాస్టుల్లో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 ఎకరాల్లో పత్తి, వరి పంటకు నష్టం వాటిల్లింది. కాళేశ్వరం వద్ద గోదావరి 8.320 మీటర్లు ప్రవహించగా మేడిగడ్డ వద్ద వరద ఉధృతి తీవ్రమై 3.10లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది.

డీఎంహెచ్‌వో సాంబశివరావు బదిలీ



పోచమ్మమైదాన్, జూలై 19: హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు బదిలీ అయ్యారు. ఈయనను వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ప్రభుత్వం బదిలీ చేసింది. హనుమకొండ జిల్లా డీఎంహెచ్‌వోగా ములుగులో వర్క్ ఆర్డర్‌తో పని చేస్తున్న డాక్టర్ ఎ.అప్పయ్యను నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అదేవిధంగా జనగామ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ హరీస్‌రాజ్ మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ప్రోగ్రాం అధికారిగా సివిల్ సర్జన్ హోదాలో పనిచేస్తున్న డాక్టర్ సుధార్‌సింగ్ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో సర్జన్ ఆర్‌ఎంవోగా బదిలీ అయ్యారు. అయితే ఇంకా మరికొన్ని జిల్లా డీఎంహెచ్‌వోలకు సంబంధించిన జీవో విడుదల కానున్నట్లు సమాచారం. సివిల్ సర్జన్ హోదాలో 40శాతం సీలింగ్‌తో కొందరికే బదిలీలు జరిగినట్లు తెలిసింది.



ఆర్టీసీ వరంగల్ నూతన బస్‌స్టేషన్ నమూనా చిత్రం

వరంగల్ పాత బస్‌స్టేషన్‌లో ఇంకా కొనసాగుతున్న భవనాల కూల్చివేతలు



అంతులేని నిర్లక్ష్యం

వరంగల్ బస్టాండ్ పనుల్లో తీవ్ర జాప్యం

- ఇంకా పూర్తికాని పాత భవనాల కూల్చివేత
- శంకుస్థాపన చేసి ఇప్పటికే ఏడాది
- పట్టించుకోని 'కుడా' యంత్రాంగం
- అధికారుల తీరుపై ప్రయాణికుల ఆగ్రహం
- మంత్రి చొరవ చూపాలని విజ్ఞప్తి

గిర్మాజీపేట, జూలై 19: అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారుతోంది. వరంగల్ ఆర్టీసీ నూతన బస్టాండ్ నిర్మాణంలో అంతులేని జాప్యం జరుగుతుండడంతో మండిపడుతున్నారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణానికి శంకుస్థాపన జరిగి ఏడాది దాటినా ఇంకా పాత భవన కూల్చివేత పనులే పూర్తికాలేదు. అభివృద్ధి పనుల పేరుతో బ్రోచర్లను అందమైన రంగుల్లో ముద్రించిన చొరవ.. పనుల్లో లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

38 ఏళ్ల కిందట..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1986 డిసెంబరు 21న నాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వరంగల్ బస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. నిత్యం 48లోకల్, 200జిల్లా బస్సుల ద్వారా నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల సంఖ్య పెరిగినా ఆ మేరకు అభివృద్ధి చేయడంలో పాలకులు, ప్రజా ప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో బస్టాండ్ శిథిలావస్థకు చేరింది.

పూర్తి కాని కూల్చివేతలు

కొత్త బస్టాండ్ కోసం తాత్కాలికంగా వరంగల్ రైల్వేగూడ్స్ షెడ్ ప్రహరీ, ఎస్ఎస్ఎం క్లబ్ ఎదురుగా బస్టాండ్ ఏర్పాటు చేశారు. ఏప్రిల్‌లో పాత బస్‌స్టేషన్ కూల్చివేత పనులు ప్రారంభించారు. పాత భవనాలు కావడం, కూల్చివేత సమయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో కూల్చివేత ప్రారంభమైన తొలిరోజే వాటర్ ట్యాంక్ కూలుస్తుండగా కూలి వాటి కిందపడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మరువక ముందే, మే 20న అర్ధరాత్రి పేలుడు పదార్థాలతో భవనాలను కూల్చివేశారు. కుడా అధికారుల పర్యవేక్షించకపోవడంతో కూల్చివేత పనులు ఇంకా పూర్తి కావడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డుపై హోటళ్లు, రాకపోకలు యథావిధిగా కొనసాగుతుండటంతో ఇప్పట్లో బస్టాండ్ పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదని నగరవాసులు మండిపడుతున్నారు.

రైల్వేస్టేషన్ నుంచి ర్యాంపు నిర్మించాలి..

రైల్వే బస్టాండ్ ఎదురెదురుగా ఉన్న నేపథ్యంలో నూతన బస్‌స్టేషన్ నిర్మాణం రైల్వే, ఆర్టీసీ ప్రయాణికులకు అనుకూలంగా పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైలు దిగిన వారు నేరుగా బస్టాండ్‌కు, అలాగే బస్సులు దిగిన వారు రైల్వేస్టేషన్‌కు చేరుకునేలా రెండింటినీ అనుసంధానం చేస్తూ నడకమార్గం ర్యాంపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మంత్రి చొరవ చూపాలి..

బస్టాండ్ నిర్మాణపనులు శరవేగంగా జరిగేలా స్థానిక ఎమ్మెల్యే మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. 'కుడా' అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనులు చేసేలా చూడాలని, పనుల ఆలస్యానికి చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కుడా, ఆర్టీసీ అధికారులతో చర్చించి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలంటున్నారు.

తాత్కాలిక బస్టాండ్‌లో వసతుల లేమి

ఎస్ఎస్ఎం క్లబ్ ఎదురుగా సుమారు రూ.50లక్షలతో ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాండ్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లాట్‌ఫాంలు సరిపోవడం, షెడ్‌లు వెడల్పు లేకపోవడంతో ప్రయాణికులు నిలుచునేందుకు కూడా ఇబ్బంది అవుతోంది. ప్లాట్‌ఫామ్ ఎత్తుకూడా చిన్నదిగా ఉండడంతో బస్సులు దూసుకువచ్చి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు జంకుతున్నారు. షెడ్డు చిన్నదిగా ఉండడంతో ఎండ, వాన నుంచి రక్షణ లేకుండా పోతోంది. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. వరదనీరు వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో అటు వర్షపునీరు, ఇటు డ్రైనేజీ నీరు బస్టాండ్‌లో నిలిచి చెరువులను తలపిస్తోంది. ఆర్టీసీ కార్గో కౌంటర్‌కు వెళ్లే వారంతా బస్‌స్టేషన్‌ల నుంచి వాహనాలపై రాకపోకలు సాగిస్తుండటంతో బస్సులను సంబంధిత వాహనాలు ఢీకొనే ప్రమాదాలు లేకపోలేదు. ఇదిలాఉంటే హైదరాబాద్, శ్రీశైలం తదితర దూర ప్రాంతాల సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేయడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు సైతం బస్సు సర్వీసులను రద్దు చేశారని వాపోతున్నారు.

రూ.75కోట్లతో బస్టాండ్‌కు శ్రీకారం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం బస్‌స్టేషన్ అభివృద్ధిపై దృష్టి సారించింది. అధునాతన బస్టాండ్ నిర్మాణానికి 'కుడా' నుంచి రూ.75కోట్లను మంజూరు చేసింది. గత జూన్ 17న అప్పటి రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పనులను ప్రారంభించారు. మల్టీప్లెక్స్, రెస్టారెంట్ తదితర సదుపాయాలతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నాటి నుంచి ఇప్పటి వరకు పాత బస్టాండ్ కూల్చివేత, తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటుతో చేతులు దులుపుకున్నారు.



బస్‌స్టేషన్ నిర్మాణానికి గతేడాది జూన్ 17న వేసిన శంకుస్థాపన శిలాఫలకం



ఇరుకుగా మారిన తాత్కాలిక బస్‌స్టేషన్ షెడ్డు..

బాధ్యతను విస్మరిస్తే చర్యలు: కలెక్టర్



బొల్లికొండలో విద్యార్థి పఠనా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్

నెక్కొండ, జూలై 19: ఉద్యోగులు బాధ్యతను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని, స్థాన చలనానికి కూడా వెనకాడేది లేదని కలెక్టర్ సత్యశారద హెచ్చరించారు. శుక్రవారం నెక్కొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్‌లు, ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం తొమ్మిదిన్నరకు కలెక్టర్ వెళ్లగా తొమ్మిది గంటలకు విధులకు హాజరుకావాల్సిన డాక్టర్ రహేలతస్వీర్ రాకపోవడంతో మెమోజారీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. నెక్కొండ టీఎస్ఆర్‌జేసీ, నెక్కొండ, అప్పల్‌రావుపేట హైస్కూళ్లను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందిస్తున్నారా అనే విషయం అడిగితెలుసుకున్నారు. అప్పల్‌రావుపేట పాఠశాలలో నిర్మాణం పూర్తయిన తరగతి గదులకు రంగులు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అభివృద్ధి పనులకు సంబంధించి మండల ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడం లేదని, పనులు పూర్తయిన విషయం ఎలా తెలుస్తుందన్నారు. పాఠశాల ఆవరణలో చెత్త పేరుకుపోకుండా ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే విష పురుగులు చేరుకునే ప్రమాదం ఉంటుందన్నారు. నెక్కొండ ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు..

అప్పల్‌రావుపేట, బొల్లికొండ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు ఎందు లేరంటూ అంగన్‌వాడీ టీచర్లను కలెక్టర్ ప్రశ్నించారు.



నెక్కొండ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

హాజరు పట్టికల రిజిస్టర్‌లో పిల్లల పేర్లు ఉంటున్నాయి తప్పా, సెంటర్‌లో పిల్లలు లేకపోవడానికి గల కారణం ఏమిటని కలెక్టర్ అడుగగా, జ్వరాల కారణంగా పిల్లలు సెంటర్‌కు రావడం లేదని తెలిపారు. పిల్లలురాని సెంటర్‌లను గుర్తించి రద్దు చేస్తామని, సెంటర్‌లో ప్రతీ రోజు పిల్లలు ఉండేలా చూడాలంటూ ఆదేశాలను జారీ చేశారు. బొల్లికొండ గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ నీరు అపరిశుభ్రంగా ఉందని, నీటిని శుభ్రపర్చాలని కార్యదర్శిని కలెక్టర్ ఆదేశించారు.

టీచర్లు సక్రమంగా విధులు నిర్వహించకనే..

ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహించక పోవడంతోనే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని కలెక్టర్ సత్యశారద మండిపడ్డారు. బొల్లికొండ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులను నిర్వహిస్తుండగా ఐదు తరగతులకు గాను ఆరుగురు విద్యార్థులు ఉండడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కలెక్టర్ తనిఖీ సమయంలో ఆరుగురిలో కేవలం ఒక్క విద్యార్థే ఉండడం, అతడికి యూనిఫామ్ లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థికి కలెక్టర్ ఇంగ్లీష్, తెలుగు పుస్తకాలు ఇచ్చి చదవమనగా చదవలేక పోయాడు. పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఎలా చేర్పిస్తారంటూ ఉపాధ్యాయులను ఉద్దేశించి మండిపడ్డారు.

రూ.52లక్షల బంగారం అపహరణ

- తాను పనిచేసే బంగారం దుకాణంలోనే చోరీ
- అన్నం పెట్టిన యజమానినే మోసగించిన కేటుగాడు
- దొంగను పట్టుకున్న సీసీఎస్, మట్టెవాడ పోలీసులు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 19: ఉపాధి కల్పించిన యజమానినే మోసం చేశాడో ప్రబుద్ధుడు. ఆయన దుకాణానికే కన్నం వేసి రూ.52లక్షల విలువ కలిగిన 800గ్రాముల బంగారం అపహరించాడు. ఈ సంఘటన మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘరానా దొంగను సీసీఎస్ పోలీసులు, మట్టెవాడ పోలీసులు అరెస్టు చేసి దొంగ నుంచి 700గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు.

మహారాష్ట్రకు చెందిన సురేష్ లక్ష్మణ్‌బాద్ కొన్ని నెలలుగా వరంగల్‌లో నివసిస్తూ బంగారం వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. జల్సాలకు అలవాటుపడిన సురేష్ లక్ష్మణ్‌బాద్ అప్పులు చేశాడు. ఉపాధి కోసం తిరగగా ఏపనీ దొరకకపోవడంతో కొద్దిరోజులు పిజ్జా సెంటర్ నడిపాడు. ఈ వ్యాపారంలోనూ నష్టం రావడంతో తనకు తెలిసిన వ్యక్తి ద్వారా వరంగల్ విశ్వకర్మ వీధిలో బంగారం కరిగించే వ్యాపారాన్ని నిర్వహిస్తున్న సంజయ్ వద్ద మే నెలలో పనిలో చేరాడు. నమ్మకంగా పనిచేయడంతో యజమాని సురేష్‌కు తాళాలు ఇచ్చి బయటికి వెళ్లేవాడు. అయితే యజమాని లేని సమయంలో నిందితుడు సురేష్.. గత నెల 14న షాపులోని కెమెరాలు ఆఫ్‌చేసి 800గ్రాముల బంగారం చోరీ చేసి పారిపోయాడు. షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణకు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో సీసీఎస్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుడు చోరీ చేసిన బంగారం అమ్మేందుకు సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వెళుతున్నాడనే సమాచారంతో వరంగల్ రైల్వేస్టేషన్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకుని బంగారం స్వాధీనం చేసుకున్నారు.

అయితే నిందితుడు సురేష్ లక్ష్మణ్‌బాద్ బంగారం చోరీ చేసిన అనంతరం తన స్వస్థలానికి వెళ్లాడు. అక్కడి తన మిత్రుడైన తానాజీ యాదవ్ వద్ద బంగారం కరిగించి బిస్కెట్లుగా చేసి వంద గ్రాముల బంగారం అతడికి అమ్మాడు. మిగతా బంగారం అదే ప్రాంతంలో అమ్మే ప్రయత్నం చేశాడు. వీలుకాకపోవడంతో విజయవాడలో అమ్మేందుకు వస్తున్న క్రమంలో నిందితుడు పోలీసులకు చిక్కాడు. కాగా, నిందితుడిని సకాలంలో పట్టుకున్న ప్రత్యేక బృందాన్ని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈ సందర్భంగా అభినందించారు. విలేకర్ల సమావేశంలో అదనపు డీసీపీ రవి, వరంగ్ ఏసీపీ నందిరాంనాయక్, సీసీఎస్, మట్టెవాడ సీఐలు అబ్బయ్య, గోపి, ఏఏవో సల్మాన్‌పాషా, మట్టెవాడ ఎస్ఐ విఠల్, ఏఎస్ఐ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కుమార్తెకు భూమి ఇవ్వనీయడం లేదని..

- కొడుకుని హత్య చేయించిన తండ్రి
- ముగ్గురు నిందితుల అరెస్టు : డీఎస్పీ

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 19: కుమార్తెకు 20 గుంటల భూమి ఇవ్వకుండా అడ్డపడి నిత్యం తమను కొట్టిన కుమారుడిని తండ్రే హత్య చేయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అందుకు సంబంధించిన వివరాలను భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత ఏప్రిల్ 23న భూపాలపల్లి మండలంలోని రాంపూర్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియకుండా పెట్రోల్ పోసి కాల్చి చంపిన మృతదేహం లభ్యమైందన్నారు. ఈ మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం ఎస్సై ప్రసాద్ నేతృత్వంలో 5 ఇంక్లైన్ కమాన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా పర్వతగిరి మండలం తురుకుల సోమవారం గ్రామానికి చెందిన బానోత్ బాలాజీ, ఇదే గ్రామానికి చెందిన బానోత్ సిద్ధు, బానోత్ శ్రీను ఆటోలో పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. వర్ధన్నపేటలోని రందాన్‌తండాకు చెందిన గుగులోత్ ప్రభాకర్ (29)ను పెళ్లి సంబంధం కోసమని చెప్పి భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం తీసుకెళ్తుండగా రాంపూర్ అటవీ ప్రాంతంలో మద్యం తాగించి తలపై బండరాయితో కొట్టి చంపి పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయినట్లు అంగీకరించారు. హత్య ఎందుకు చేశారని అడుగగా.. మృతుడి తండ్రి నరసింహస్వామినే కుమారుడిని చంపాలని రూ.50వేలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

మిగతా 8వ పేజీలో..



బదిలీలు రద్దు చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

బల్దియా కార్మికులకు బదిలీల గండం

75ఏళ్లలో ఎప్పుడూ చేయలేదని ఆవేదన

నేడు సీఎంను కలువనున్న యూనియన్ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: బల్దియా పారిశుధ్య కార్మికులకు బదిలీల టెన్షన్ పట్టుకుంది. గురువారం 445 మంది కిందిస్థాయి ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా, మరికొందరు ఏకంగా అంబులెన్స్‌లలో కౌన్సెలింగ్‌కు వచ్చిన పరిస్థితి ఉంది. ప్రధానంగా 30 కేటగిరీలలో పనిచేస్తున్న 445 మంది ఉద్యోగుల్లో ఎక్కువగా దళిత సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడంతో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే 75 యేళ్ల వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో నాలుగోతరగతి ఉద్యోగులకు ఎన్నడూ బదిలీలు జరగలేదని అంటున్నారు.

నేడు చలో హైదరాబాద్

గ్రేటర్ వరంగల్ పరిధిలో ఎన్నడూ లేని విధంగా నాలుగో తరగతి ఉద్యోగులను బదిలీ చేయడం సరైంది కాదని తెలంగాణ మునిసిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు ఇటీవల కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియంశ్రీహరిని కలిసి సమస్యలు వెల్లడించారు. వారు సైతం సానుకూలంగా స్పందించినా బదిలీల తంతు ఆగడం లేదు. దీంతో శనివారం ఉద్యోగ సంఘాలు, ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలువనున్నట్టు తెలిపారు. అంతేకాకుండా బదిలీల తీరుపై హైకోర్టును ఆశ్రయించి బదిలీల రద్దుకు పోరాటం చేస్తామని సంఘం నాయకులు బొట్ల బిక్షపతి మాదిగ, ధర్మరాజులు తెలిపారు.

విద్యుత్‌తో జాగ్రత్త



వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ

హనుమకొండ టౌన్, జూలై 19: విద్యుత్ ప్రమాదాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ నాణ్యమైన విద్యుత్ పరికరాలను వినియోగించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని వరంగల్, హనుమకొండ ఎస్‌ఈలు మధుసూదన్‌రావు, వెంకటరమణ సూచించారు. గ్రామాల్లోని వినియోగదారులు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్, ఏఈల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రమాదాల నుంచి బయటపడాలంటే కింది జాగ్రత్తలను పాటించాలని వినియోగదారులకు సూచించారు.

- వ్యవసాయం నిమిత్తం రైతులు పంపుసెట్లను వినియోగిస్తున్నప్పుడు కరెంట్ మోటార్లు కానీ, పైపులు కానీ, ఫుట్‌వాల్వులను అశ్రద్ధతో తాకొద్దు. ఆ సమయాల్లో విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం సంభవించే ఆవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వర్షాలు కురిసినప్పుడు విద్యుత్‌స్తంభాలను, తెగిపడిన తీగలను, స్టాటర్లను, మోటార్లను తాకొద్దు. వేలాడుతున్న కరెంట్ తీగల గురించి మీకు దగ్గర్లోని కరెంట్ ఆఫీస్, సంబంధిత అధికారులకు తెలియజేయాలి.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- సర్వీస్ వైర్లను వీధి దీపాలను సరిచేసేందుకు ఇతరులు విద్యుత్ స్తంభాలను ఎక్కొద్దు. విద్యుత్ సిబ్బంది సహాయం తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఇంటి వరండాలో మరియు ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ దగ్గరలో (జీఐ) వైరును దండెముగా కట్టి తడిబట్టలను ఆరవేయడం ప్రమాదకరం. ఎవరికైనా కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరగా ఉన్న వ్యక్తులు షాక్ గురైన వ్యక్తులను రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోరాదు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని వస్తువులను వాడటమే సరైన పరిష్కారం.
- చేపల వేటకు విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వాడరాదు.
- బోరు వేస్తున్నప్పుడు విద్యుత్ వైర్లు తాకి కొంతమంది చనిపోతున్నారు. బోర్లు వేస్తున్నప్పుడు పైన విద్యుత్ వైర్లు ఉన్నాయా లేదా అని ఒక సారి చూసుకొని జాగ్రత్తగా బోర్లు వేసుకోవాలి.
- జెండాలు ఎగుర వేస్తున్నప్పుడు జెండా పైపులు పైన విద్యుత్ వైర్‌కు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వరికోతల సమయంలో హార్వెస్టర్స్‌కు విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటంతో షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ బంద్ చేసి మాట్లాడాలి.
- జంతువుల నుంచి పంట రక్షణ కోసం విద్యుత్ ఫెన్సింగ్ వేస్తున్నారు. ఇది చట్టరిత్యా నేరం. విద్యుత్ కంచెలు వేయరాదు.

కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి..

ప్రొఫెసర్ కంచ ఐలయ్య



సదస్సులో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

కాళోజీ జంక్షన్, జూలై 19: హనుమకొండ బాలసముద్రంలోని కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని అక్కడే గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హరిత కాకతీయ హోటల్‌లో 'తెలంగాణ ఉద్యమం - గద్దర్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సుకు డీఎంఎస్‌ఎ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ అధ్యక్షత వహించారు. కళాక్షేత్రం ప్రారంభం కాకముందే పేరు పెట్టడం సరైంది కాదని ఆయన అన్నారు. గద్దర్ అంటే కేవలం ఒక ప్రాంతానికి, వర్గానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరి మనిషి అని ఐలయ్య అన్నారు. కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టకుంటే, విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోతే ఉద్యమాలు చేసి సాధించుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర సాహిత్య యువ పురస్కార్ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ విషయంపై పట్టించుకోకుంటే పోరాడి సాధించుకుంటామని తెలిపారు. సమావేశంలో ఇంకా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాడపాక రాజేందర్, పలు విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు.

చదరంగ వీరులు

- చెస్‌లో రాణిస్తున్న ఓరుగల్లు ఆణిముత్యాలు
- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అర్జున్, రాజారిత్విక్, సరయు



నేడు అంతర్జాతీయ చదరంగ దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, జూలై 19: చదరంగం అంటేనే ప్రత్యర్థి కదలికను గమనిస్తూ ఎత్తుకు పైఎత్తు వేస్తూ వ్యూహాత్మకంగా ఆలోచిస్తూ చిత్తు చేయడం. అంతేకాకుండా ప్రత్యర్థి ఆలోచనల్ని విభిన్న కోణాల నుంచి పసికడుతూ విజయం వైపు దూసుకెళ్లాల్సి ఉంటుంది. మైండ్‌గేమ్‌గా ప్రాచుర్యం పొందిన చెస్‌లో రాణించాలంటే చిన్నతనం నుంచి ఆట పట్ల ఆసక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ, నిబద్ధత తప్పనిసరిగా ఉంటేనే సాధ్యమవుతుంది. 1966 జూలై 20న యునెస్కో ఆలోచన మేరకు ఫిడే ఆదేశాలతో తొలిసారిగా అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. దీంతో యేటా భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలలో చదరంగ దినోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శనివారం అంతర్జాతీయ చదరంగం (చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు చెస్ దిగ్గజాలు, గ్రాండ్ మాస్టర్లు, (జీఎం)లు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.

జిల్లా కుసుమాలు

ప్రపంచ స్థాయిలో ఆదరణ పొందిన చెస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడకారులు సత్తా చాటుతున్నారు. అర్జున్, రాజరిత్విక్, సరయులు అంతర్జాతీయ చెస్‌లో రాణిస్తూ వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్న వయస్సులోనే గ్రాండ్ మాస్టర్లుగా అర్హత సాధించి రాష్ట్రానికి, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తున్నారు. హనుమకొండ నగరానికి చెందిన ఇరిగేసి అర్జున్ 15 ఏళ్లకే క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో రాష్ట్రం నుంచి తొలి గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదాను సాధిం చాడు. ప్రపంచస్థాయి క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్ లో 4వ స్థానంలో నిలవగా, భారతదేశం నుంచి క్లాసికల్ ఫిడే రేటింగ్‌లో తొలి స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించాడు. అదే విధంగా నగరానికి చెం దిన మరో అంతర్జాతీయ చెస్ దిగ్గజం రాజావరం రాజారిత్విక్.. తన తండ్రి స్వతహాగా చెస్ క్రీడాకా రుడు కావడంతో 6ఏళ్ల వయస్సులో కోచ్ బొళ్లం సంపత్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ క్లాసికల్ ఫిడే చెస్ రేటింగ్‌లో 17ఏళ్ల వయస్సులోనే తెలంగాణ నుంచి రెండో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. అలాగే మొండ్రాయి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సరయు చిన్నతనంలోనే చెస్ క్రీడ పట్ల ఆసక్తి పెంచుకుంది. ఇది గమనించిన తండ్రి చెస్‌లో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించుకున్నాడు. కోచ్ బొళ్లం సంపత్ వద్ద శిక్షణ తీసుకుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్‌పోటీల్లో పాల్గొని ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదాను అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. పేద కుటుంబంలో జన్మించిన సరయు ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా ఐఎం హోదాను సాధించి 3 నార్మ్‌లు చెస్‌లో పాల్గొని అత్యధిక ఫిడ్ చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్ హోదా సాధించే అవకాశం దగ్గరలోని ఉంది.

క్రీడాకారులను ప్రోత్సహించాలి..

చెస్ క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోతున్నారని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెస్ మేధావులను ప్రభుత్వం గుర్తించి ఆదరిస్తే మరెన్నో అద్భుతాలను సృష్టించే అవకాశం ఉందంటున్నారు. చదరంగంలో రాణించాలంటే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఆదరిస్తే మరికొంత మంది క్రీడాకుసుమాలు అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందంటున్నారు.

చాంపియన్‌షిప్ సాధించడమే లక్ష్యం

ఇరిగేసి అర్జున్, చెస్ గ్రాండ్ మాస్టర్ హనుమకొండ



25వ అబుదాబీ చెస్ ఫెస్టివల్, మాస్టర్స్ టోర్నమెంట్‌లో మూడో నార్మ్‌లో విజయం సాధించి గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల పర్యవేక్షణతోనే జీఎం హోదాను సాధించాను. ఫిడే రేటింగ్‌లో ప్రపంచ చాంపియన్‌గా ఉన్న మాగ్నస్ కార్ల్‌సన్ పై విజయం సాధించి ప్రపంచ చెస్ చాంపియన్ సాధించడమే నా లక్ష్యం.

సూపర్ గ్రాండ్ మాస్టర్ సాధిస్తా..

రాజావరం రాజారిత్విక్, చెస్ గ్రాండ్ మాస్టర్



మైండ్ గేమ్ అయిన చెస్ రాణించాలంటే ఏకాగ్రత తప్పనిసరి, 17ఏళ్ల వయస్సులో రాష్ట్రం నుంచి రెండో చెస్ గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించాను. సూపర్ గ్రాండ్ మాస్టర్‌గా నార్మ్స్ సాధించి ఫిడే చెస్ రేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభతో రాణించి ప్రపంచ చెస్ చాంపియన్‌గా విజయం సాధిస్తానని నమ్మకం ఉంది.

గ్రాండ్ మాస్టర్ సాధించడమే కర్తవ్యం

సరయు, చెస్ ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం)



జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించి ఫిడే చెస్ రేటింగ్ ఆధారంగా వివిధ హోదాలు అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే క్యాండిడేట్ మాస్టర్ (సీఎం) ఫిడే మాస్టర్ (ఎఫ్ఎం) ఇంటర్నేషినల్ మాస్టర్ (ఐఎం) హోదాను సాధించాను. దీంతో పాటుగా మూడు నార్మ్‌లు వివిధ దేశాల ప్రత్యర్థులతో పాల్గొని ఫిడే చెస్ రేటింగ్ సాధించి గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలనేదే నా కర్తవ్యం.

ఇద్దరు గ్రాండ్ మాస్టర్లుగా ఎదగడం గర్వకారణం

బాసిరి వెంకట రాజ్‌గోపాల్, వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ఇరిగేసి అర్జున్, రాజవరం రాజారిత్విక్‌లు చిన్న వయస్సులోనే చెస్‌లో గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం గర్వకారణం. చిన్నప్పటి నుంచి చెస్ క్రీడ పట్ల పట్టుదలతో సాధనం చేయడం ద్వారానే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు.

రేపు నేత్ర, అవయవ, శరీరదాన ఐక్య వేదిక సమావేశం

కాళోజీ జంక్షన్, జూలై 19: నేత్ర, అవయవ, శరీరదాన రాష్ట్ర ఐక్య వేదిక సమావేశం ఆదివారం హనుమకొండలోని గోపాల్‌పూర్ జంక్షన్ సమీపంలోని అభినిలయంలో నిర్వహిస్తున్నట్లు ఐక్య వేదిక వరంగల్ జిల్లా డైరెక్టర్ కొన్‌రెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వరలింగం, కో కన్వీనర్ రాంకల్యాణ్, ప్రముఖ డాక్టర్ దాసరి ప్రసాదరావు, పలు సేవా కార్యక్రమాల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నేత్ర, అవయవ, శరీరదాన ప్రాముఖ్యతను, భావజాలాన్ని వ్యాప్తి చేయడం సమావేశ ఉద్దేశమని మల్లారెడ్డి వివరించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు. సమావేశ వివరాల కోసం సెల్ నంబర్లు: 87905 48706 / 97037 38699 లను సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో లారీ డ్రైవర్ ఆత్మహత్య



మర్కండి వేణు (ఫైల్)

మట్టెవాడ, జూలై 19: ఆర్థిక ఇబ్బందులు తాళలేక లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హంటర్ రోడ్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో జరిగింది. మట్టెవాడ సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం. నగరంలోని హంటర్‌రోడ్ ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మర్కండి వేణు (54) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు పని నిమిత్తం బయటికి వెళ్లిన వేణు భార్య స్వరూపకు సమాచారం అందించారు. ఆమె వచ్చిన వెంటనే ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వేణుకు భార్య స్వరూప, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దామెర, జూలై 19 : దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన బిల్లా సురేందర్ రెడ్డి, బిల్లా దివ్యలు ద్విచక్రవాహనంపై హనుమకొండ కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒగ్లాపూర్ స్టేజి వద్ద ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ప్రమాదవ శాత్తు కిందపడిపోయారు. దీంతో తీవ్రగాయాలైన క్షతగాత్రులను 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 19: గంజాయిలాంటి మత్తు పదార్థాల నియంత్రణకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంబర్ కిషోర్ ఝా మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకు డ్రగ్ కంట్రోల్ టీంను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల విక్రయాలపై, మత్తుపదార్థాలు సేవించే వారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక టీం పనిచేస్తుందన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. డ్రగ్స్ కిట్‌లతో నిరంతరం రోడ్లపై తనిఖీలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో డీ ఎడిక్షన్ సెంటర్ సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో పూర్తి స్థాయిలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెలుతున్నట్లు అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

కౌన్సెలింగ్‌కు వెళ్లిన నర్సింగ్ ఆఫీసర్లు

ఎంజీఎంలో ఇబ్బందులు పడుతున్న రోగులు

వరంగల్ మెడికల్, జూలై 19: రాష్ట్ర ఆరోగ్యశాఖ సంచాలకుల కార్యాలయ నిర్లక్ష్యం వల్ల నర్సింగ్ ఆఫీసర్ల కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పడంతో ఎంజీఎం నుంచి 200లకు పైగా నర్సింగ్ ఆఫీసర్లు గురువారం రాత్రి నుంచే సెలవులు పెట్టి హైదరాబాద్‌కు వెళ్లారు. తీరా అక్కడకు వెళ్లాకా మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ అని ప్రకటించారు. అప్పటికే తప్పుల తడకగా ఉన్న లిస్టుతో కౌన్సెలింగ్ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా నర్సింగ్ ఆఫీసర్లు అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ ముందు వేకెన్సీ లిస్టును, స్పౌజ్, వికలాంగులు తదితర ప్రాధాన్యక్రమంకు సంబంధించిన జాబితాలు ప్రకటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సెలింగ్‌కు అడ్డుతగిలారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ జరుగుతుందా లేదా అనే అయోమయంలో ఉన్నారు. దీంతో ఎంజీఎంలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థులతో సేవలను అధికారులు నెట్టుకు వస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఎంజీఎం రోగులకు శాపంగా మారింది.

వంగపహాడ్‌లో త్వరలో పోలీసు ఔట్‌పోస్ట్

అడ్డుకునేందుకు కొందరి ప్రయత్నాలు

వరంగల్ క్రైం, జూలై 19: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామ ప్రారంభంలో పోలీసు ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఈ ప్రాంతంలో 2010 నుంచి 2015 వరకు ఔట్‌పోస్ట్ ఉండేది. తర్వాత ఔట్‌పోస్ట్ ఎత్తేశారు. ఓఆర్‌ఆర్‌పై అసాంఘిక కార్యకలాపాలు సాగుతుండటం, మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమదందాలు సాగుతుండటంతో ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలనే ఆలోచన పోలీసులు చేస్తున్నట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారం సాగుతుండటంతో దందాలు చేసేవారు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా ముందస్తు ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తే దందాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో పోలీసులతో బేరసారాలు చేస్తున్నారని తెలిసింది. కొందరు పోలీసులు సైతం ఒక బేరం కుదుర్చుకుని ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయకుండా చూస్తామని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఔట్‌పోస్ట్ ఏర్పాటుపై కాజీపేట ఏసీపీని వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

26 నుంచి కేయూ బీటెక్ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 19: కాకతీయ యూనివర్సిటీ జూలై 26 నుంచి ఇంజనీరింగ్ (బిటెక్) రెండో, మూడో సెమిస్టర్ నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహ చారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజు శుక్రవారం ప్రకటించారు. జూలై 26, 30, ఆగస్టు 1, 3, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెండు, మూడో సెమిస్టర్లకు చెందిన రెగ్యులర్, సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని కోఎడ్యుకేషన్, మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, మంచి ర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వడ్డెపల్లి, జూలై 19: ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడిశెట్టి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉన్నారని, వీరి సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ బీమా పథకాన్ని రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ ఏడునెలలు కావొస్తున్నా కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఆటోడ్రైవర్ల ఆదాయానికి గండి పడిందని పేర్కొన్నారు. వేలాది మంది ఆటోడ్రైవర్లు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.25వేలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కులో నిర్వహించే ధర్నాలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇమ్మడిశెట్టి రాజు కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ నేతలు గౌని రాజు, ఆవుల నవీన్‌కుమార్, మస్కే కరుణాకర్, అక్కనపెల్లి అంజయ్య, గోపనబోయిన రాజు, బరిగెల కృష్ణమూర్తి, ఆమంచ ప్రశాంత్, బండారి శ్రీకాంత్, ఆకుల వెంకటేష్, పత్తి నర్సయ్య, తాళ్ల అంజి, వస్కుల రాజ్‌కుమార్, గడ్డం కిరణ్, తప్పెట పరశురాములు, కొట్టె జోసఫ్ పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపరుచుకోవాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి



హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎండీ

హనుమకొండ టౌన్, జూలై 19: పనితీరును మరింత మెరుగుపరుచుకొని వినియోగదారులకు అంతరాయాల్లేని విద్యుత్ సరఫరాను అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి సూచించారు. డిస్కమ్ పరిధిలో ఉద్యోగుల ప్రతిభ ఆధారంగా నెలవారీగా అందించే జ్ఞాపికలు, ప్రశంసాపత్రాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన మేనెల జ్ఞాపికలను సీఎండీ ఉద్యోగులకు అందజేశారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రశంసలు అందుకున్న ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని ఇతర ఉద్యోగులు విధి నిర్వహణలో రాణించాలన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న ఇంజనీర్లకు ఈ సందర్భంగా సీఎండీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో డిస్కమ్ పరిధిలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఉమ్మడి వరంగల్ ఏడీఈ విభాగంలో హనుమకొండ టౌన్ ఏడీఈ మల్లికార్జున్, ఏఈ విభాగంలో యం.ప్రవీణ్ - నక్కలగుట్ట, ఏఈ రమేశ్ - దామెర, నవీన్‌కుమార్ - సుబేదారి, బి.పద్మ - హనుమకొండ రూరల్ డివిజన్, ఐనవోలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ టి.మధుసూదన్, సీజీఎం కిషన్, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, హనుమకొండ రూరల్ డివిజన్ డీఈ బి. సామ్యనాయక్, ఏడీఈ పరకాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భరత్ ఉద్యమ స్ఫూర్తితో అనేక పోరాటాలు

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క ● ఎంచగూడెంలో సంస్మరణ సభ



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న విమలక్క భరత్ కుటుంబసభ్యులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 19 : జనశక్తి నేత భరత్ తన ఉద్యమంలో చూపిన తెగువతోనే గోదావరి లోయ విప్లవోద్యమంలో అనేక పోరాటాలు జరిగాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో జనశక్తి నేత భరత్ 24వ సంస్మరణ సభను భరత్ కుమారులు కృష్ణ, శ్రీను, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు శుక్రవారం నిర్వహిం చారు. ముందుగా భరత్ కుమారులు, కుటుంబసభ్యులు, అభిమానులతో కలిసి భరత్ స్తూపం వద్ద నివాళులు విమలక్క అర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ తాను అజ్ఞాతంలో పనిచేయలేదని కాని విప్లవాన్ని, అమరత్వాన్ని తన పాటలతో ప్రజల్లోకి తీసుకెళ్లానని పేర్కొన్నారు. విప్లవోద్యమ చరిత్రలో భరత్ పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. నేడు విప్లవోద్యం చీలికలై బలహీనపడుతుందన్నారు. ఉద్యమాలకు తీరని నష్టం జరుగుతుందని ఆవేదన చెందారు. విప్లవకారులు, ప్రజలు బాధపడుతున్నారన్నారు. చీలికలను ఆసరగా చేసుకుని పెట్టుబడి దారులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. పలువురు ఉద్యమకారులు భరత్‌తో ఉన్న తమ అనుభవాలను, నాటి పోరాటలను గుర్తు తెచ్చుకున్నారు. కాగా, విమలక్క, పుష్పక్క, యోచన పాడిన పాటలు ఉత్తేజపరిచాయి, మరికొన్ని కన్నీళ్లు పెట్టించాయి. సభలో మంత్రి సీతక్క కుమారుడు సూర్య, మాజీ జనశక్తి రాజన్న, విష్ణుమూర్తి, జగ్గన్న, సత్తెన్న, రవీందర్, విజయక్క, నాగన్న, ఎన్డీ నాయకులు గౌని అయిలయ్య, శ్రీశైలం, భరత్ బంధువులు బండి పెద్దకుమార్, బండి కుమారస్వామి, జిట్టబోయిన యాకయ్య, సుంకరబోయిన మొగిలి, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఆర్డీఎస్డీఈ ట్రైనింగ్ ఆఫీసర్ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఎస్‌టీఈ ఆఫీసర్ విజయ్‌కుమార్

కేయూ క్యాంపస్, జూలై 19: వృత్తి విద్యా కోర్సులు చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని హైదరాబాద్‌లోని రీజికల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంటప్రెన్యూర్‌షిప్ ఆఫీసర్ కె.విజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం హనుమకొండ వృత్తి విద్యా కళాశాలల ఆవరణలో విద్యార్థులకు అప్రెంటిషిప్ మేళా-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బెడదం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇంటర్ ఒకేషనల్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కేంద్ర టెక్నికల్ సంస్థ శిక్షణ సంస్థ ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.7వేలు ఉపకార వేతనంగా శిక్షణ సమయంలో చెల్లిస్తుందని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ రీడర్ బి.రమేశ్ మాట్లాడుతూ.. అభ్యర్థులు ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ), జాబ్‌మేళా కన్వీనర్ ఎ.గోపాల్ మాట్లాడుతూ.. ఇంటర్ స్థాయిలో ఇలాంటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకేషనల్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్రెంటిషిప్ మేళా కోకన్వీనర్ కె. మాధవరావు, జనగామ నోడల్ ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శాగంటి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, జాబ్‌మేళాకు అభ్యర్థులు విశేషంగా హాజరయ్యారు. రిజిస్ట్రేషన్లు చేసుకుని ఉద్యోగాలు పొందారు.





ఘటన స్థలంలో భవాని, దినేష్

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు, జూలై 19: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో వివాహిత మృతిచెందగా, భర్త, కుమారుడు తీవ్రగాయాల పాలైన సంఘటన శుక్రవారం మండలంలోని గూడెప్పాడ్ క్రాస్‌వద్ద జరిగింది. లారీ శరీరం మీది నుంచి పోవడంతో ఛిద్రమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన బలభద్ర దినేష్ - భవాని(23) దంపతులకు కుమారుడు ప్రద్యుమన్ ఉన్నారు. వీరు వరంగల్‌లో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం వరంగల్‌కు వెళ్లిన వీరు.. మధ్యాహ్నం వరంగల్ నుంచి గూడెప్పాడ్‌కు కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పరకాలకు వస్తున్న లారీ.. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ క్రాస్ వద్ద ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న భవాని, దినేష్‌తో పాటు రెండేళ్ల బాలుడు ఎగిరి పడ్డారు. భవానిపై లారీ ముందు టైరు వెళ్లడంతో పొట్టపగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మకూరు సీఐ సంతోష్ కుమార్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ భవాని మృతి చెందినట్లు సీఐ తెలిపారు. భర్త దినేష్, కుమారుడు ప్రద్యుమన్‌లు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



వానమబ్బుల వేళ.. పుడమి పచ్చందాల కళ..

ఓ వైపు వానమబ్బులు.. మరోవైపు పచ్చని అందాలను పరుచుకున్న పుడమి. ఆ అపురూప దృశ్యాల కలయిక ఎంతో చూడముచ్చటగా ఉంటుంది కదూ. గుట్టల మాటు నుంచి పొగమంచు తెరల్లా కనిపిస్తున్న ఆ చిరుజల్లుల సవ్వడిలోనే రైతులు, కూలీలు పొలం పనుల్లో నిమగ్నమైన దృశ్యాలు కనులవిందు చేశాయి. ఈ ప్రకృతి రమణీయ దృశ్యం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా వద్ద శుక్రవారం కనిపించింది.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

గీసుగొండ, జూలై 19: ఇటీవల రంగశాయిపేటలో ఫిట్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ధర్మారం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఓర్సు హరీష్,ఎస్. కిశోర్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సాంబయ్య శుక్రవారం తెలిపారు. 25న హర్యానాలో జరిగే జాతీయ పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. కాగా ప్రతిభ కనబరచిని విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ కుమారస్వామి, ఫిజికల్ డైరెక్టర్ జొసొవజ్ర, ఏఏపీచైర్మన్ రాధిక పాల్గొన్నారు.



సంగెంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

దేశానికి అన్నదాతే వెన్నుముక : రేవూరి

సంగెం, జూలై 19 : దేశానికి అన్నం పెట్టే రైతే వెన్నుముకని, అందుకే ప్రభుత్వం వారికి పెద్దపీట వేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీని వారి ఖాతాల్లో జమచేయడంతో శుక్రవారం ధన్యవాదాలు తెలుపుతూ మండలంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వంజారపల్లి, పల్లారుగూడ, పోచమ్మ తండా, బాలాజీతండా, మొండ్రాయి, నార్లవాయి, నల్లబెల్లి, ఎల్గూరుస్టేషన్, రంగంపేట, తిమ్మాపురం, కాపులకనపర్తి, కాట్రపెల్లి గ్రామాల మీదుగా సంగెం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభి షేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2022 మే 6నవరంగల్ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరి సిల్ల రాజయ్య, మండలపార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, పరకాల ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు దొమటి సంపత్, నాయకులు జనగాం రమేష్, కేశవులు, ఆగపాటి రాజు, నరహరి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ప్రతీక: రేవూరి

గీసుగొండ: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ వేడుకలు ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సూర్యాతండాలో తీజ్ వేడుక ల్లో 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం మా ట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు తీజ్ జరుపుకోవటం ఆనందంగా ఉంద న్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, రాఘవ, రమేష్, నాగరాజు, గిరిజన పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ సంధ్యారాణి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సంగెం, జూలై 19 : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. శుక్రవారం గవిచర్ల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు పాఠశాల ల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి కావాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం వసతులు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశా రు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంఈవో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమకొండ టౌన్, జూలై 19: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వరంగల్ డీఈ ఎస్.మల్లిఖార్జున్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. దేశాయిపేట, ఏజే మిల్స్ ఏనుమాముల సబ్‌స్టేషన్స్ పరిధిలోని ఏనుమాముల మార్కెట్ రోడ్డు, రెడ్డిపురం, కొత్తపేట, దేశాయిపేట, ఎల్‌బీ నగర్, బాలాజీనగర్, ఓసిటీ, లేబర్‌కాలనీ, రాంకీ, ఎస్ ఆర్‌టీ కాలనీ, టీఆర్‌టీ కాలనీ, హంటర్‌రోడ్డు, బీట్‌బజార్, రామన్నపేట పరిధిలో ఉద యం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని పేర్కొన్నారు.



ఎల్లంబజార్‌లో..

గుంతలతో.. గుబులు

- అధ్వానంగా నగర రోడ్లు
- మరమ్మతులను పట్టించుకోని బల్దియా
- శాఖల మధ్య కొరవడిన సమన్వయం

మట్టెవాడ, జూలై 19: చిన్నపాటి వర్షానికే నగరరోడ్లు ఛిద్రంగా మారుతున్నాయి. ఎక్కడికక్కడే కంకరతేలి, గుంతలు ఏర్పడడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ముందే రోడ్లను మరమ్మతు చేయాల్సిన కార్పొరేషన్, ఆర్ అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని నగరవాసులు మండిపడుతున్నారు. నగరంలో 100లకు పైగా రహదారులు గుంతలు పడినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. నిత్యం వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు, వాహనదారులు ప్రయాణించడానికి వణుకుతున్నారు. నగరంలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలు గుబులు పుట్టిస్తున్నాయి. ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఇంజనీర్ల పర్యవేక్షణ ఏది...

కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలోని ఇంజనీర్లు, రోడ్లు ఆర్ అండ్ బీ ఇంజనీర్ల పనితీరుపై నగరవాసులు మండిపడుతున్నారు. రోజువారీగా పనులు సైతం పెండింగ్‌లో పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారుల మరమ్మతుల చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. నగరంలో కాలనీ రోడ్లతోపాటు అంతర్గత రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. కంకర తేలి గుంతల మయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే రోడ్లపై నీరు నిలవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పనుల్లో నాణ్యతా లోపం..

అడపాదడపా గుంతలు పూడుస్తున్నా, కొద్ది రోజులకే మళ్లీ యథాస్థితి నెలకొంటోందని నగరవాసులు పేర్కొంటున్నారు. కార్పొరేషన్, ఆర్ అండ్‌బీ ఈ తంతు నిత్యకృత్యంగా సాగుతోంది. గుంతల్లో బీటీని, సీసీని వేసి మొక్కుబడిగా చదును చేసి చేతులు దులుపుకుంటున్నారు. తేమ ఉన్నా బీటీని వేసి వెళ్లిపోతుండడం వీరి నిర్లక్ష్యానికి పరాకాష్టని నగరవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో తారు అతుక్కోక కొద్ది రోజులకే మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. తాత్కాలిక గుంతలున్న చోట శుభ్రపరచాలి. చతురస్రాకారంలో రహదారిని కట్ చేసి కింద తేమ, మట్టి, లేకుండా చేసి తర్వాత బీటీ/సీసీని వేసి పూడ్చాల్సి. అనంతరం రోలర్లను ఉపయోగించి చదును చేయాలి. అవేవీలేకుండా కేవలం బీటీని వేసికొద్ది సేపు తూతూమంత్రంగా చదును చేసి చేతులు దులుపుకుంటున్నారు. మరో వైపు వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్లాంట్ల నుంచి తీసుకొస్తున్న బీటీ నాసిరకంగా ఉంటాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా రహదారిపై వేసినా ఎక్కువకాలం నిలవడం లేదు.

దారులన్నీ గుంతలమయమే..

వరంగల్ ములుగు రోడ్డు, ఎంజీఎం జంక్షన్, కొత్తవాడ గుడి, గోపాలస్వామి గుడి జంక్షన్, పోచమ్మమైదాన్, అబ్బాస్ ఫంక్షన్ హాల్ జంక్షన్, కాశిబుగ్గ జంక్షన్, వెంకట్రామ జంక్షన్, తెలంగాణ జంక్షన్, హెడ్ పోస్టాఫీసు జంక్షన్, వరంగల్ పాత చౌరస్తాలో రోడ్లు గుంతలమయంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఎంజీ రోడ్డు, దేశాయిపేట రోడ్డు, ఏనుమాముల మార్కెట్ రోడ్డు, దేశాయిపేట నుంచి ఏనుమాముల మార్కెట్, హెడ్ పోస్టాఫీసు నుంచి శివనగర్ రోడ్డు, పాత చౌరస్తా రోడ్డు, పోతన రోడ్డు, నర్సంపేట రోడ్డులో రోడ్లపైన గుంతలు పడటంతో వర్షపు నీరు నిలుస్తోంది. అదే విధంగా వరంగల్ ప్రాంతంలోని చాలా కాలనీల్లో అంతర్గత రోడ్లు ప్రమాదంగా ఉన్నాయి. ప్రధానంగా వరంగల్ ఎల్లంబజార్‌రోడ్డు, పాపయ్యపేట చమాన్, పిన్నవారి వీధి రోడ్డు, చారుబౌళి రోడ్డు, అబ్బాస్ ఫంక్షన్ హాల్ నుంచి ఎల్‌బీనగర్ రోడ్డు, కాశిబుగ్గ తిలక్ రోడ్డు, కాశిబుగ్గ నుంచి ఓ సిటీ వేళ్లే రోడ్డు, కాశిబుగ్గ మార్కెట్ రోడ్డు, లక్ష్మీపురం రోడ్డు, గిర్మాజీపేట రోడ్డు తదితర రోడ్లు అధ్వానంగా మారింది. ఇప్పటికైనా కార్పోరేషన్, ఆర్ అండ్ బీ అధికారులు నిర్ల క్ష్యాన్ని విడి మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.



నర్సంపేట రోడ్డు తెలంగాణ జంక్షన్ వద్ద గుంతలమయంగా రోడ్డు

ప్రజాపాలన కేంద్రాన్ని తనిఖీ చేసిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రాన్ని శుక్రవారం గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆకస్మిక తనిఖీ చేశారు. దరఖాస్తుల నమోదు, సవరణ పరిశీలించారు. గతంలో నమోదు చేసిన దరఖాస్తులలో ఎందుకు తప్పులు దొర్లాయి.. జిరాక్స్ ప్రతులు ఎందుకు అప్లోడ్ కాలేదని తెలుసుకున్నారు. అర్హు లైన ప్రతీ ఒక్కరి దరఖాస్తును స్వీకరించి న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కమిషనర్ వెంట సెక్రెటరీ విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

'మహిళాశక్తి'పై అవగాహన కల్పించండి

స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు మహిళా శక్తిపై అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బందితో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, క్యాటరింగ్ క్యాంటీన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, కట్టడాలకు సంబంధించిన సామగ్రి తదితర 8 రంగాలకు కమ్యూనిటీ ఆర్గనైజర్ల సహాయంతో బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. తొలిదశలో భాగంగా రూ.32కోట్ల రుణాలు అందజేస్తామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సెక్రెటరీ విజయలక్ష్మి, టీపీఆర్వో కోల రాజేశ్, ఎల్‌డీఎం రాజు, శ్రీనిధి రీజినల్ మేనేజర్ అశోక్, టీఎంసీ రమేష్ పాల్గొన్నారు.



ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

వర్షాల దృష్ట్యా టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు..

వర్షాకాలం నేపథ్యంలో అత్యవసర సమయంలో సాయం కోసం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ 1800 425 1980, 97019 99645 నెంబర్‌లకు ఫిర్యాదు చేయాలని కమిషనర్ అశ్విని ప్రజలకు సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలోని కంట్రోల్ రూంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదుల రిజిస్టర్‌ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వరద సమస్యలు ఎదురైనప్పుడు మాన్సూన్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

11 మందికి జరిమానా

మట్టెవాడ, జూలై 19: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 11 మందికి రూ.14వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. అలాగే లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వాహనదారునికి రూ.500 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక



గీసుగొండ, జూలై 19: మొగిలిచర్ల పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికలను శుక్రవారం నిర్వహించారు. లెఫ్టినెంట్ కల్నల్ సెంథిల్ రామదురై ఆదేశాలతో సుబేదార్ మేజర్ చౌరాసియా హవల్దార్ విజయ్‌లు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 22 మంది కేడెట్లను ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ రవిందర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళి

'చంద్రశేఖర్ మృతి తీరని లోటు'

ఖిలావరంగల్, జూలై 19: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర సెక్రెటరీ, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి రాయల చంద్రశేఖర్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటని వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. శుక్రవారం ఖిలావరంగల్ చెమన్ అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.అనంతరం మాట్లాడుతూ చంద్ర శేఖర్ ప్రజా పోరాటాల్లో రైతాంగ పోరాటాల్లో 50 సంవత్సరాలు అలుపెరుగని పోరాటం చేశాడరన్నారు. ఇటీవల రైలు ప్రమాదంలో ఆయన మృతిచెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ-ఎంఎల్, మాస్‌లైన్ డివిజన్ నాయకులు మైదం పాణి, బైరబోయిన అయిలయ్య, ఇనుముల కృష్ణ, కిషోర్, రాజేందర్, బాబు, జనార్దన్, కొమురయ్య పాల్గొన్నారు.

కుమార్తెకు భూమి ఇవ్వనీయడం లేదని..

5వ పేజీ తరువాయి

తెలిపారు. ప్రభాకర్ తన చెల్లికి భూమి ఇవ్వకుండా అడ్డుపడుతూ తండ్రి రామస్వామి, తల్లిని కొడుతూ చంపుతామని బెదిరించేవాడని తెలిపారు. దీంతో కొడుకు వ్యవహార శైలితో విసుగు చెంది ఈ అఘా యిత్యానికి ఉసిగొలిపినట్లు నిందితులు స్పష్టం చేశారు. దీంతో నేరాన్ని ఒప్పుకున్న దృష్ట్యా బానోత్ బాలాజీ, బానోత్ సిద్దు, బానోత్ శ్రీనులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. మృతుడి తండ్రి రామస్వామి పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఏఈ కృష్ణమూర్తి

వరంగల్ కార్పొరేషన్, జూలై 19: బల్దియా ఇంజనీరింగ్ విభాగంలో ఏఈగా పని చేస్తూ వ్యక్తిగత కారణాల వల్ల మే 8 నుంచి సెలవుపై వెళ్లిన కె.కృష్ణమూర్తి శుక్రవారం తిరిగి విధుల్లో చేరినట్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కృష్ణమూర్తి పని చేసిన 3, 14, 15, 16, 17తోపాటు 47వ డివిజన్‌లను కృష్ణమూర్తికి అప్పగిస్తున్నట్టు వెల్లడించారు. సెలువులో ఉన్నకాలంలో ప్రస్తుత డివిజన్‌లను ఎం.సతీష్‌కుమార్, ఎ మీర్ముర్తుజా ఏఈలు అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. కృష్ణమూర్తి విధుల్లో చేరడంతోపాత అవే డివిజన్‌లను కేటాయిస్తున్నట్టు కమిషనర్ వెల్లడించారు.

ఆశ్రమ పిల్లలకు ఉచిత వైద్య శిబిరం



వరంగల్ చౌరస్తా, జూలై 19: డాన్‌బాస్కో వీధి పిల్లల ఆశ్రమానికి చెందిన 41 మంది చిన్నారులకు ఎస్‌జీఎస్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఆశ్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనితారెడ్డి, రవి, అజయ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మృతి



అమృతబాయి (ఫైల్)

దుగ్గొండి, జూలై19: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పొనకల్‌లో శుక్రవారం చోటుచేసుకొంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కిటికే అమృతబాయి (66) వ్యవసాయ కూలీ పనులు ముగించుకొని ఇంటికి వచ్చి కరెంటు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైమృతి చెందింది. మృతిరాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

పర్వతగిరి, జూలై 19 : అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ఏనుగల్లులో రైసుమిల్లు, పల్లె ప్రకృతి వనం, హై స్కూల్‌ను సంద ర్శించారు. హై స్కూల్‌లో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించారు.పాఠశాలలో జరుగుతున్న మిగతా పనులను పూర్తిచేయాలని ఆదేశించారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీవాత్సవ

మట్టెవాడ, జూలై 19: మహిళా సంఘాలు, రైతులు బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు డిప్యూటీ జోనల్ మేనేజర్ హితింద్రనాథ్ శ్రీవాత్సవ అన్నారు. బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వరంగల్ ఓ సిటీలో బ్యాంకు ఆఫ్ ఇండియా, ప్రగతి ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ బ్యాంకు వరంగల్ బ్రాంచి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీవాత్సవ మాట్లాడుతూ.. రైతులు, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు రుణాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ హవేలీ రాజు, చీఫ్ మేనేజర్ సురేంద్రసింగ్ చౌహాన్, బ్యాంకు అధికారులు బి.రాజేష్, బి.గోపి కృష్ణ, కొండి మధుకర్ గౌడ్, పోరిక విఠల్ కుమార్, ఎ.శ్రీనివాస్, జి.కరుణశ్రీ పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



శంభునిపేట, జూలై 19 : పిల్లలు భౌతికంగా, మానసికంగా ఎదిగేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణసురేష్ కోరారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శంభునిపేట గిరిప్రసాద్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సువర్ణ, అంగన్ వాడీ సూపర్‌వైజర్ ఆశాదేవిలు హాజరై మాట్లాడారు. రెండున్నర సంవత్సరాల నుంచి పిల్లల్ని నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ జయశ్రీ, సాహెదా బేగం, ఆయాలు ఆశా వర్కర్స్, బిల్‌కిస్ బేగం, ఐకేపీ ఆర్పీ పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీల్లోనే నాణ్యమైన విద్య

శంభునిపేట, జూలై 19 : ప్రభుత్వ కళాశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్ అన్నారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలను కోరుతూ శుక్రవారం ప్రిన్సిపాల్ కె.శోభాదేవితో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1984లో ప్రారంభమైన కళాశాల ఇప్పటి వరకు వేల మంది విద్యార్థుల భవిష్యత్తులను తీర్చిదిద్దిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లారెడ్డి, వీరాంజనేయులు, సుధాకర్, నరేష్, రజిత, లక్ష్మీ, ఎర్ర ప్రవీణ్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేడల ప్రసాద్



వరంగల్ రూరల్

గుడుంబా విక్రయదారులపై కేసు నమోదు

వర్ధన్నపేట, జూలై 19 : వరంగల్ రూరల్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.మురళీధర్ ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వర్ధన్నపేట పరిధిలోని రాయపర్తి మండలంలో గల తిరుమలాయపల్లి, రాయపర్తి, పెరికేడు గ్రామాల్లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న వారిని రాయపర్తి తహసీల్దార్ ముందు గతంలో బైండోవర్ చేశారు. అయినప్పటికీ వీరిలో మార్పు రాక తిరిగి గుడుంబా విక్రయిస్తున్న పెరికేడుకు చెందిన మహ్మద్ సలీమా నుంచి రూ.50 వేలు వర్ధన్నపేట ఎస్‌బీఐలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు డిపాజిట్ చేయించారు. తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన తిరుపతి యాకయ్య రాయపర్తి గ్రామానికి చెందిన చందు రాజకొమురమ్మ తిరిగి గుడుంబాను విక్రయిస్తున్న వీరిద్దరిని ఖమ్మం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరూప, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సరిత, సిబ్బంది కె.శ్రీధర్, పి.రమేష్‌బాబు, వై.శరత్‌బాబు, ఎం.బాబు, ఎం.రవి, మానస పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు చేయూత



మహిళ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

నెక్కొండ, జూలై 19 : మహిళ సంఘాలు ఆర్థికంగా బలపడడానికి చిన్నతరహా కుటీర పరిశ్రమలను ఏర్పాటుచేసుకోవడానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని కలెక్టర్ సత్యశారద తెలిపారు. మండలంలోని తోపనపల్లి గ్రామంలో రైతు వేదిక భవనంలో భాగ్యలక్ష్మి మహిళసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు.

వీధి కుక్కలు కరవకుండా మూతులకు బుట్టలను అమర్చాలి

జిల్లా వ్యాప్తంగా ప్రజలు వీధి కుక్కలతో భయభ్రాంతులకు గురవుతున్నారని, అవి కరువకుండా వాటి మూతులకు బుట్టలను అమర్చడానికి పంచాయతీ కార్యదర్శులకు చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, ఎస్సై మహేందర్, ఆర్ఐ నరేందర్, కార్యదర్శులు సదానందం, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం అభినందనీయం



రమేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. సోషల్‌మీడియా ద్వారా గ్రామంలోనిసమస్యలను అధికారుల దృష్టికితీసుకువస్తున్న మండ లంలోని బొల్లికొండ గ్రామానికి చెం దిన మానవ హక్కుల పరిరక్షణ సమితి సభ్యుడు బానోతు రమేశ్‌ను స్వయంగా కలుసుకోవడానికి కలెక్టర్ శుక్రవారం అతని ఇంటికి వెళ్లారు. కలెక్టర్ వెళ్లిన సమయంలో రమేశ్ ఇంటివద్ద లేకపోవడంతో అతని కుటుంబ సభ్యులను పలకరించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సోషల్ మీడియా ద్వారా రమేశ్ తన దృష్టికి తీసుకువచ్చాడని విలేకరులకు తెలిపా రు. అతడిని స్వయంగా కలుసుకుంటే మరిన్ని సమస్యలను తెలుస్తాయన్న ఉద్దేశంతో ఇంటికి వెళ్లినట్లు చెప్పారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

పర్వతగిరి, జూలై 19 : అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి అన్నారు. శుక్రవారం మండలంలోని ఏనుగల్లులో రైసుమిల్లు, పల్లె ప్రకృతి వనం, హై స్కూల్‌ను సంద ర్శించారు. హై స్కూల్‌లో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించారు.పాఠశాలలో జరుగుతున్న మిగతా పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, మండల నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి, ఏపీవో సుశీల్‌కుమార్, ఏపీఎం కృష్ణమూర్తి, ఈసీ రాజు, సీసీ సుధాకర్, కార్యదర్శులు యాకూబ్‌పాషా, రాజు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

• సంగెం : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. మండలంలోని గవిచర్ల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రా లను పరిశీలించి, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి కావాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం వసతులు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంఈవో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రుణ సంబురాలు

సంగెం, జూలై 19 : దేశానికి అన్నం పెట్టే రైతే వెన్నముకని, అందుకే ప్రభుత్వం వారికి పెద్దపీట వేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం రైతుల రుణ మాఫీని వారి ఖాతాల్లో జమచేయడంతో శుక్రవారం ధన్యవాదాలు తెలుపుతూ మండలంలో భారీర్యాలీ నిర్వహించారు. వంజారపల్లి, పల్లారుగూడ, పోచమ్మతండా, బాలాజీతండా, మొండ్రాయి, నార్లవాయి,నల్లబెల్లి, ఎల్గూరుస్టేషన్, రంగంపేట, తిమ్మాపురం, కాపులకనపర్తి, కాట్రపెల్లి గ్రామాల మీదుగా సంగెం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, పరకాల ఎఫ్‌ఎస్‌సీఎస్ అధ్యక్షుడు సంపత్, నాయకులు రమేష్, కేశవులు, రాజు, నరహరి, హరిబాబు, శేఖర్, వీరమ్మ పాల్గొన్నారు.

•నర్సంపేట : రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని నర్సంపేట సొసైటీ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ:2లక్షల రుణమాఫీ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సొసైటీ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి, రవి, రాజిరెడ్డి, రాము, మహేశ్వరం మాజీ సర్పంచ్ నిరంజన్‌రెడ్డి, మధు, కాంగ్రెస్ నాయకులు, సొసైటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సొసైటీ చైర్మెన్, సభ్యులు

• నర్సంపేట టౌన్ : ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం రైతులు, నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని గురిజాల , చంద్రయ్యపల్లె గ్రామాలల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ డక్క శ్రీనువాస్ మండల యూత్ అధ్యక్షుడు కుక్కమూడి అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు అచ్చయ్య, రాజేశ్వర్‌రావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రాజు, చందర్‌రావు, శ్రీనువాస్‌గౌడ్, శ్రీనువాస్, సాంబయ్య, నర్సయ్య, అనిల్, మోహన్, కొమురయ్య, నవీన్, అరవింద్, ప్రవీన్, ప్రణయ్ పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి గ్రామంలో ప్రధాన సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహంవద్ద, పాపయ్యపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల నాయకురాలు పులి మంజులగౌడ్



సంగెంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, రాంబాబు, అమీర్‌ఖాన్, వెంకన్న, సందీప్, సంతోష్, మాజీ సర్పంచ్ భాస్కర్, అశోక్, చంద్రయ్య, ప్రభాకర్, అశోక్, సాగర్, చిన్నవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : పంట రుణమాఫీ చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. మండలంలోని రేకంపల్లిలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగె నర్సింగరావు ఆధ్వర్యంలో, మదిర, తిమ్మంపేట, మహ్మదాపురం, మల్లిపల్లి తదితర గ్రామాల్లో క్షీరాభిషేకం చేశారు. టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రమేశ్, భాస్కర్, బాలయ్య, నవీన్, శ్రీనివాస్, రఘుపతిరెడ్డి, ఆగయ్య, మనేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కిరణ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

• రాయపర్తి: రాష్ట్రంలోని రైతులను రాజులుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని గ్రామ కాంగ్రెస్ పార్టీ తీగల సాయిలు అన్నారు. మండలంలోని పెర్కవేడులో రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవేందర్, సుధాకర్, కుమార్, చిన్నసాయిలు, కృష్ణ, శ్రీనివాస్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రత్తంగా ఉండాలి

చెన్నారావుపేట, జూలై 19 : మండలంలోని అమీనాబాద్, పాపయ్యపేట, కోనాపురం గ్రామాల్లో పీహెచ్‌సీ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడుతూ వర్షా కాలంలో వచ్చే సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవాని, సువర్త సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాయపర్తి పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక కోరారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో 10వ వార్డులో రాయపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడంతోపాటు మురికి కాలువల్లో దోమల నివారణ కోసం పిచికారి చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజు, మత్స్యాస్‌రెడ్డి, శ్యాం, ప్రేమ్‌ప్రసాద్, ఏఎన్ఎం అరుణ, అనిత తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ సతీష్, డాక్టర్ సునిత అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని గిరిజన సైనిక్ స్కూల్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు డాక్టర్ రాకేష్ వైద్య పరీక్షలు చేసి మందులను ఇచ్చారు. విద్యార్థులకు వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై అవగాహన



అమీనాబాద్‌లో ఉచిత వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న సిబ్బంది

కల్పించారు. అశోక్‌నగర్ గ్రామంలో డాక్టర్ సతీష్, ధర్మరావుపేటలో డాక్టర్ సునీత ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, ఏఎన్ఎంలు సుజాత, రమాదేవి, విజయ, విజయారాణి తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా విద్యాలయం, గిర్నిబావిలోని జ్యోతిరావు పూలే విద్యాలయం విద్యార్థులకు, తొగర్రాయి, శివాజీనగర్ గ్రామాల ప్రజలకు స్థానిక డాక్టర్లు, కిరణ్‌రాజు, వనమాల, భరత్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలలో హెచ్‌ఈవో సాంబయ్య చాణిక్య రహిమాన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



అమృతబాయి (ఫైల్)

దుగ్గొండి, జూలై 19 : ప్రమాద వశాత్తు విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని పొనకల్‌లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకొంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కిటికే అమృతబాయి (66) వ్యవసాయ కూలీ పనులు ముగించుకొని ఇంటికి వచ్చి కరంటు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైమృతి చెందింది. మృతిరాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.

13 మంది కార్యదర్శుల బదిలీ

దుగ్గొండి, జూలై 19 : మండలంలో 33 మంది పంచాయతీరాజ్ కార్యదర్శులు ఉండగా, ఇటీవల నిర్వహించిన బదిలీలలో 13 మంది బదిలీ అయ్యారు. మండలంలోని వెంకటాపురానికి యాదగిరి, గిర్నిబావికి సునే వేణుప్రసాద్, చంద్రయ్యపల్లికి సురేశ్, తిమ్మంపేటకు నాగరాజు, చాపలబండకు రాజమౌళి,ఆడవిరంగాపురానికి విజయ్, మల్లిపల్లికి స్పందన, స్వామిరావుపల్లికి రాజు, శివాజీనగర్‌కు రజిని, దేశాయిపల్లికి దిలీప్‌కుమార్, గొల్లపల్లికి రఘుపతి, రెబల్లేకు శివకుమార్ బదిలీ అయ్యారని ఎంపీవో శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. 13మందిలో ఏడుగురు మండలంలోని ఇతర గ్రామాలకు బదిలీయ్యారని తెలిపారు.

అసౌకర్యం కలిగిస్తున్న వాహనాలు



బస్టాండ్‌లో నో పార్కింగ్‌లో నిలిపిన వాహనాలు

వర్ధన్నపేట, జూలై 19 : వర్ధన్నపేట మునిసిపాలిటీలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. ప్రధానంగా వాహనదారులు నీడ ఎటువస్తే అక్కడే ద్విచక్రవాహనాలు నిలుపుతుండడంతో ఇబ్బందిగా మారింది. ప్రధానంగా బస్టాండ్ ముఖద్వారం నుంచి వెళ్లే ప్రయాణికులు మెట్లపై నుంచి వెళ్లేవారు. మెట్లకు అడ్డుగా వాహనాలు నిలపడంతో వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందిగా మారి బస్టాండ్‌లోకి వెళ్లకుండా అరుబయటే నిలబడి ఆర్టీసీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో మోస్తారు వర్షం

వర్ధన్నపేట రూరల్, జూలై 19 : గత రెండు రోజులుగా కురుస్తున్న ఓ మోస్తారు వర్షాలతో మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతుల ఆశలు చిగురిస్తున్నారు. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవడంలేదంటూ ఆందోళన చెందుతున్న రైతులకు ఊరట లభించింది. భారీవర్షం కురవక పోయినా చిరు జల్లులు పడుతూ వాతావరణం చల్లబడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పత్తి మొక్కలకు కాస్తా ఊతమిచ్చే విధంగా ఉన్నాయని రైతులు సంతోషంతో వివిధ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

యాంత్రీకరణ వరి నాటు క్షేత్ర ప్రదర్శన

నెక్కొండ, జూలై 19 : వరినాటు వేయడానికి యంత్రాలను వినియోగించడంతో రైతులకు ఆర్థికభారం తగ్గుతుందని జిల్లా వ్యవసాయాధికారి డి.ఉషాదయాల్ అన్నారు. మండలంలోని రెడ్లవాడలో శుక్రవారం వరినాటుపై యాంత్రీకరణ క్షేత్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఎకరా నాటు వేయడానికి రూ. 5వేల వరకూ ఖర్చు అవుతుందన్నారు. నారుమడి చదును, నారు మోయుట వంటి ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగరాజు, ఏఈవో రాజీవ్‌లోచన్, రైతులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తను పార్టీ గుర్తిస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి, జూలై 19 : కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండల కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల న్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంగా అవలంబించాల్సిన వ్యూహాలపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలి

వర్ధన్నపేట రూరల్, జూలై 19 : తెలంగాణ ప్రభుత్వం మహిళా అభి వృద్ధి, వారి సంక్షేమంకోసం ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల ని డీఆర్డీఏ అడిషనల్ పీడీ రేణుకాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లందలో మహిళా శక్తి కార్య క్రమంలో భాగంగా మునుకుంట్ల స్వరూప అనే మహిళ ఏర్పాటు చేసిన పౌల్ట్రీ మదర్ యూనిట్ ఏర్పాట్లను పరిశీలించి, మాట్లాడారు. మహిళలు ఆర్థికాభి వృద్ధితోపాటు సామాజిక వృద్ధిసాధించాలని తెలిపారు. జనజీవనానికి ఎలాంటి హానీ లేకుండా గ్రామానికి వెలుపల విశాలమైన మైదానంలో పౌల్ట్రీఫామ్ ఏర్పాటు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డీపీఎం సరిత, ఏపీఎం వేణు, అశోక్, సీసీ కొమురయ్య, వీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

నర్సంపేట, జూలై 19 : రైతాంగ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్రఅధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు.పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు రైతు లందరికీ రూ.2లక్షల రుణమాఫీచేయాలని డిమాండ్‌చేశారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయపరికరాలు అందించాలని, ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రాజన్న, సోమన్న, నాయక్, రాంమూర్తి, సోమన్న, కాంతారావు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీ ఎన్నిక

ఖానాపురం, జూలై 19 : మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీని శుక్రవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తడుగుల స్వామి, ఉపా ధ్యక్షుడిగా జాడి కిరణ్, ప్రధాన కార్యదర్శిగా తూడి కుమారస్వామి, కోశాధికారి గా పొలసాని రవి, గౌరవ అధ్యక్షుడిగా బయ్య శ్యామ్‌లను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ ఫోటోగ్రఫీపై ఆధారపడి జీవిస్తున్న ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వం ప్రత్యేకరుణాలు అందించి ఆదుకోవాలన్నారు. కార్య క్రమంలో తూడి కోటేశ్వర్‌రావు, ఫోటోగ్రాఫర్లు షేక్ ఫరీద్, జాడి వెంకటేష్, రామటెంకి కార్తిక్, ఆకుల శ్రీనివాస్, బత్తిని రమేష్, కళ్లెపు రాజు, జనగాం రమేష్ పాల్గొన్నారు.

కుమార్తెకు భూమి ఇవ్వనీయడం లేదని..

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ప్రభాకర్ తన చెల్లికి భూమి ఇవ్వకుండా అడ్డుపడుతూ తండ్రి రామస్వామి, తల్లిని కొడుతూ చంపుతామని బెదిరించేవాడని తెలిపారు. దీంతో కొడుకు వ్యవహార శైలితో విసుగు చెంది ఈ అఘాయిత్యానికి ఉసిగొలిపినట్లు నిందితులు స్పష్టం చేశారు. దీంతో నేరాన్ని ఒప్పుకున్న దృష్ట్యా బానోత్ బాలాజీ, బానోత్ సిద్ధు, బానోత్ శ్రీనులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. మృతుడి తండ్రి రామస్వామి పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ప్రతీక : రేవూరి

గీసుగొండ, జూలై 19: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ వేడుకలు ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సూర్యాతండాలో తీజ్ వేడుకల్లో ఎకుడ్ చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు తీజ్ జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, రాఘవ, రమేష్, నాగరాజు, గిరిజన పాల్గొన్నారు.

ప్రతిభను కనబర్చిన ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులకు పురస్కార ప త్రాలను అందజేస్తున్న డీఎం ప్రసూన లక్ష్మి

నర్సంపేట, జూలై 19 : నర్సంపేట ఆర్టీసి డిపోలో లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిభను కనబర్చి ఎక్కువ ఆదాయం తీసుకు వచ్చిన ఉద్యోగులను శుక్రవారం డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి సన్మానించి పురస్కార పత్రాలను అందజేశారు.ఆమె మాట్లాడుతూ డిపోలో పనిచేసే ఉద్యోగులు ఎక్కువ ఆదాయం తీసుకు వచ్చి డిపో ఆదాయం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవాని, ఎంఎఫ్ ప్రభాకర్, సూపర్‌వైజర్ నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

వనభోజనాలకు తరలిన గ్రామస్థులు

పర్వతగిరి, జూలై 19 : మండల కేంద్రానికి చెందిన పలువురు గ్రామస్థులు శుక్రవారం వనభోజనాలకు తరలివెళ్లారు. రిజర్వాయర్ సమీపంలో ఉన్న వనమైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజు, వార్డు మాజీ సభ్యులు కుమారస్వామి, తిరుపతి, గ్రామస్థులు నర్సయ్య, నర్సయ్య నవీన్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల భిక్షాటన




ఖానాపురంలో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

ఖానాపురం, జూలై 19 : జీపీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు సీఐటీయూ ఆధ్వర్యంలో భిక్షాటనచేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేయాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బోడ వీరన్న, భిక్షపతి, విజయ్, వెంకటమ్మ, యాకుబీ, పార్వతి, ఐలయ్య, శ్రీను పాల్గొన్నారు.

• పర్వతగిరి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ మండల కమిటీ అధ్యక్షుడు నకరికంటి రాంచందర్ మాట్లాడుతూ జీవో 51ను రద్దుచేయాలని, సిబ్బందిని పర్మినెంట్ చేసి రూ.26వేల వేతనంతో పాటు పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు అందించాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కుమార్, వెంకన్న, రజినిబాబు, సురేష్, మహేందర్, వెంకటేశ్వర్లు, సోమయ్య, పద్మ, శ్రీకాంత్, చంద్రకళ, మౌనిక పాల్గొన్నారు.

• నెక్కొండ : మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు పర్చాలని కోరుతూ జీపీ కార్మికులు నెక్కొండలో బీక్షాటన చేపట్టారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ జీవో నెంబర్ 51 అమలు పర్చడంతో కార్మికులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.కార్యక్రమంలో నాయకులు ఈదునూరి సాయిలు, వీరస్వామి, మదార్, యాకయ్య, కృష్ణ, శ్రీనివాస్, దేవేందర్, రమేశ్ , సబితా, కళావతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీకి ధర్మారం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గీసుగొండ, జూలై 19 : ఇటీవల రంగశాయిపేటలో ఫిట్‌ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ధర్మారం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఓర్సు హరీష్, ఎస్.కిశోర్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సాంబయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 25న హర్యానాలో జరిగే జాతీయ కబడ్డీ పోటీలలో వారు పాల్గొంటారని చెప్పారు. ప్రతిభ కనబరచిని విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కుమారస్వామి, ఫిజికల్‌డైరెక్టర్ బొసావజ్ర, ఏఏపీ చైర్మన్ రాధిక పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



రంజిత్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న నాగేంద్రబాబు

నెక్కొండ, జూలై 19: మండలంలోని అలంకానిపేటకు చెందిన జనసేనా కార్యకర్త కొమ్ము రంజిత్ కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు శుక్రవారం హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును మృతుడి తండ్రి యాకయ్యకు అందించారు. జనసేన కార్యకర్త కొమ్ము రంజిత్ మార్చి ఒకటవ తేదిన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నర్సంపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జనసేన ప్రతి కార్యకర్తను పవన్‌కల్యాణ్ తన కుటుంబ సభ్యుడిగానే చూసుకుంటూ ప్రాధాన్యతను ఇస్తారని నాగేంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనా రాష్ట్ర నాయకులు సాగర్, శివకోటి, మధు, శంకర్‌గౌడ్, రాజలింగం, ప్రేమ్‌కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.